# ఉత్తరదిక్కు

దేశాటనకు బయల్దేరాడు యువరాజు. "నాయనా.... ఏవైపుకైనా వెళ్ళు గానీ ఉత్తరం దిక్కుకేసిమాత్రం వెళ్ళకు" అని హితవు చెప్పాడు రాజగురువు.

సరేనని ఉత్తరదిక్కువైపుకే యువరాజు తన ప్రయాణాన్ని సాగించాడు.

❖ ❖ ❖

బడ్డీకొట్టు ముందున్న బెంచీమీద కూర్చున్నాడు సుందరం. పదినిమిషాల క్రితమే అతను అక్కడకు వచ్చాడు. అతను పనిచేస్తున్న షాపు యజమాని తన కుటుంబంతో ఏదో ఊరు వెళుతూ ముందుగానే సుందరాన్ని ఇంటికి వెళ్ళమన్నాడు. రోజూ అయితే సుందరం రాత్రి పదిగంటల వరకూ షాపులో వుండేవాడు.

షాపులో నుంచి బయటకు రాగానే అతనికి ఇంటికి వెళ్ళాలనిపించలేదు. అందుకే ఇంటికి వెళ్ళే దారిలో వున్న తన స్నేహితుడు రాజారావు బడ్డీకొట్టు ముందు కూర్చున్నాడు. ఇద్దరూ స్కూల్లో కలిసి చదివారు.

రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. రోడ్డుకు రెండువైపులా వున్న షాపుల్లో జనం బేరాలు చేస్తున్నారు. రోడ్డుమీద నడుస్తున్న జనాన్నీ, అప్పుడప్పుడు పరుగులు తీస్తున్న మోటారువాహనాలనీ చూస్తూ అతను కాలం గడుపుతున్నాడు.

రాజారావుకు బేరం బాగానే వుంది. అతను విరామం లేకుండా తన పనిలో నిమగ్నమై వున్నాడు. కిళ్ళీలు కడుతూ, సిగరెట్లూ, బీడీలూ అమ్ముతూ అప్పుడప్పుడు సుందరాన్ని చూస్తున్నాడు. రోజూకంటే ముందుగా సుందరం అక్కడకు రావటం రాజారావుకు ఆశ్చర్యాన్ని కలిగించింది. కారణం అడగాలనుకున్నాడు గానీ బేరంలో పడి కుదర్లేదు.

రాజారావును చూస్తే సుందరానికి కొంచెం అసూయలాంటిది కలిగింది. ఒకరి దగ్గర పని చెయ్యాల్సిన అవసరం లేదు. స్వతంత్రమైన పని. ఎవరి ఒత్తిడీ లేదు. చేస్తున్న పని విసుగ్గా వుందనుకుంటే కొట్టు మూసి ఏ సినిమాకో వెళ్ళిపోతాడు. ఉదయం ఆలస్యంగా నిద్రలేస్తే ఎప్పుడో వచ్చి కొట్టు తెరస్తాడు. అయినా ఎవ్వరూ అడగరు. కానీ రాజారావు ఎప్పుడోగానీ అలా చెయ్యడు.

సెంటర్లో కొట్టు. బేరం బాగానే వుంటుంది. మంచి రాబడి వుంది. అందుకే ఆ బడ్డీకొట్టుమీద సంపాదించి అతను ఏడాదిక్రితం చెల్లెలి పెళ్ళి చేశాడు. ఇంకో ఏడాది తర్వాత తనూ పెళ్ళి చేసుకుంటాడని చెప్పాడు.

మరి తనో?

తన జీవితం గురించి ఆలోచించాలంటే సుందరానికి భయంవేసింది. కానీ రాజారావుకు అలాంటి భయం లేదుకదా అనుకున్నాడతను.

ఇంటర్ చదువుతున్నప్పుడు రాజారావు తండ్రి ఓ యాక్సిడెంటులో చనిపోయాడు. తప్పు తమది కాకపోయినా జాలితో వాళ్ళు రాజారావు తల్లికి పదివేల రూపాయలు ఇచ్చారు.

బతికున్నప్పుడు అతని తండ్రి ఓ ప్రయివేటు స్కూల్లో టీచర్‌గా వుండేవాడు. ఆ స్కూలు వైపునుంచి వచ్చే డబ్బు ఏమీ లేకపోవటంతో రాజారావు చదువు మానేసి ఆ పదివేల రూపాయలతో సెంటర్లో ఓ బడ్డీకొట్టు తెరిచాడు.

చదువు మానేస్తున్నాడని చెప్పినప్పుడూ, బడ్డీకొట్టు పెడుతున్నానని చెప్పినప్పుడూ సుందరం ఆశ్చర్యపోయాడు. ఆ బడ్డీకొట్లో రాజారావును మొదటిసారిగా చూసినప్పుడు ఇంత చిన్న వయసులో కుటుంబభారం గురించి ఇతటి కష్టమా? అనుకున్నాడు.

మధ్యలో ఓ ఐదేళ్ళు....

మరిప్పుడు తనకో?

ఎంత భయమేసినా తనిప్పుడు ఇంటికి వెళ్ళక తప్పదు. తన గతంతోనూ వర్తమానంతోనూ ముడిపడి వున్న తన కుటుంబ సభ్యులను దర్శించక తప్పదు. ఎంత వద్దనుకున్నా అతని ఆలోచనలు ఇంటిమీదకు పరుగులుతీస్తున్నాయి. వాటిని బలవంతంగా అతను నొక్కిపెడుతున్నాడు.

ఆలోచనలను మళ్ళించడానికి అతను రోడ్డుమీదకు చూశాడు.

అప్పుడే వేగంగా వెళ్ళిన కారుతో పాటు రోడ్డుమీద లేచిన దుమ్ము కూడా పరుగుదీస్తోంది. కారుకు ఎదురునుంచి సైకిలుమీద వస్తున్న కుర్రాడు భయంతో సైకిల్ని ఓ ముసలామెమీద పడేశాడు. జనం గుమిగూడారు.

సుందరం చూస్తున్నాడు.

అప్పుడే అతని ముందునుంచి ఓ యువతి, యువకుడూ మాట్లాడుకుంటూ వెళ్ళారు. ఆ యువతి సుందరాన్ని చూసికూడా చూడనట్టే నటించింది. ఆమె అతడితో కలిసి కాలేజీలో డిగ్రీ వరకూ చదువుకున్నది.

నిముషాలు గడుస్తున్నాయి.

రిక్షాబండిపైన మైకు పట్టుకుని సూర్యా టాకీస్‌లో ఆడుతున్న ఓ గొప్ప ఫైటింగ్ సినిమాను వెంటనే చూడమని చెబుతున్నాడు పెద్దగా లోపల కూర్చున్నతను.

ఇంటికి వెళ్ళకుండా రెండో ఆటకి ఆ ఫైటింగ్ సినిమాకు వెళ్ళాలనిపించింది సుందరానికి. కానీ ఇంట్లో తల్లి, తండ్రి తనకోసం ఎదురుచూస్తూ వుంటారు. వాళ్ళకు తనకంటే తన నిర్ణయం బాగా ముఖ్యం.

తను ఏ నిర్ణయం తీసుకుంటాడు?

ఒక బాధ్యతను తగ్గించుకోటానికి మరో మనిషికి మరో బాధ్యతను అంటగట్టడం న్యాయమేనా?

తన దృష్టిలో కాదు. కానీ తనూ తన తండ్రి పరిస్థితుల్లో ఉండివుంటే అప్పుడూ?

మళ్లీ తను ఆలోచిస్తున్నాడు.

తల విదిలించాడు సుందరం.

బడ్డీకొట్టుముందు జనం తగ్గిపోయారు.

ఒకతను మిఠాయికిళ్ళీ కట్టించుకుని అక్కడే నోట్లో పెట్టుకుని నముల్తూ వెళ్ళిపోయాడు. రాజారావు అప్పుడు పలకరించాడు సుందరాన్ని.

షాపునుంచి ముందుగా ఎందుకు వచ్చాడో చెప్పాడు అతను.

"సిగరెట్టు కాలుస్తావా?" అడిగాడు రాజారావు.

వద్దన్నాడు సుందరం.

అప్పుడు రాజారావు ఒక సిగరెట్టు నోట్లో పెట్టుకుని బడ్డీకొట్టు తలుపుకు ఆధారంగా వున్న ఇనుపకడ్డీకి వేళ్ళాడుతున్న కొబ్బరితాడుకు వెలిగే నిప్పుతో దాన్ని అంటించుకుని పొగ పీల్చి....

"ఇవాళైనా తొందరగా ఇంటికెళ్లకపోయావా?" అనడిగాడు సుందరాన్ని.

"వెళ్ళాలని లేదు" అన్నాడతను.

"సెకండ్ షో సినిమాకి వెడదామా? సూర్యా టాకీస్‌లో సినిమా ఇవాల్టితో పోతుంది" అన్నాడు రాజారావు.

"నేను రాను" అన్నాడు సుందరం వెంటనే.

రాజారావు నవ్వి "మొదటినుంచీ ఇంతే.... నీలో ఈ తత్వం పూర్తిగా

ఎప్పుడు పోతుందో తెలీటంలేదు" అన్నాడు.

అతడన్నది నిజమే. ఎంత ప్రయత్నం చేసినా తనలో ఈ తత్వం పూర్తిగా తుడిచిపెట్టుపోవటంలేదు. ఇది తను అలవాటు చేసుకున్నది కాదు. తనకున్న ఈ గుణం కారణంగా తను చాలాసార్లు ఇబ్బందులనే ఎదుర్కొన్నాడు. తనలాంటివాళ్ళు మరికొంతమంది వుంటారా? ఉండొచ్చు.

చిన్నతనం నుంచీ సుందరం ఎవరైనా ఏదైనా వద్దన్న పని చేసేవాడు.

సుందరం హైస్కూల్లో చేరిన కొత్తల్లో అతని స్నేహితులతో కలిసి అక్కడికి దగ్గరలో వున్న చెరువుకు వెళ్ళేవాడు. స్నేహితులు కొంతమంది చెర్లో దూకి ఈతలు కొట్టేవాళ్ళు. ఒకరోజు సుందరం తల్లి అతనికి చెరువు దగ్గరకు వెళ్ళొద్దని చెప్పింది. వెళ్ళినా చెర్లో దూకవద్దని చెప్పింది.

సరిగ్గా అదేరోజు అతను స్నేహితులతో చెరువుకు వెళ్ళి వాళ్ళతో అతనూ చెర్లో దూకాడు. అతనికి ఈత రాక మునిగిపోతుంటే ఇద్దరు మనుషులు అతన్ని బయటకు లాగారు.

తర్వాత ఒకసారి తల్లిదండ్రులతో అతను బస్సెక్కి ఏదో ఊరు వెళుతున్నాడు. బస్సులోనించి చేతులు బయట పెట్టరాదని రాసిన అక్షరాలను చదివాడు. వెంటనే అతడు చెయ్యి బయటపెట్టి కూర్చున్నాడు. కొంచెంసేపటికి బస్సు పక్కనుంచి దూసుకువెళ్ళిన లారీకి అతని చెయ్యి రాచుకుని చర్మం చెక్కుకుపోయింది.

ఒకసారి అతను స్నేహితులతో సెకండ్ షో సినిమాకు వెళ్ళాడు. ఇంటర్వెల్ తర్వాత హాలులో పొగత్రాగరాదని స్లయిడ్ వేశారు. సుందరానికి సిగరెట్టు కాల్చాలనిపించింది.

వెంటనే పక్కనే వున్న స్నేహితుడి దగ్గర సిగరెట్టు తీసుకుని వెలిగించాడు. స్నేహితులు వద్దని చెప్పినా అతను విన్లేదు. ఓ నిముషానికి ఇద్దరు పోలీసులు అతడ్ని బయటకు తీసుకెళ్ళారు.

మరోసారి అతను రైల్లో వెళ్ళేటప్పుడు రైలును ఆపటానికి వున్న గొలుసును చూశాడు. అతనికి రైలును ఆపాలనిపించింది. వెంటనే గొలుసు పట్టుకుని బలంగా లాగాడు. రైలు ఆగిపోయింది. అతను వెంటనే ఆ పెట్టెలో నుంచి దిగి మరో పెట్టెలో ఎక్కాడు.

సుందరం జీవితంలో ఇలాంటి సంఘటనలు ఇంకొన్ని వున్నాయి. అయితే ఇలాంటి పనులన్నీ ఎందుకు చేశాడో అతనికి తెలీదు. ఇతనికి అనిపించింది

చేశాడంతే. ఎవరైనా ఏదైనా చేద్దామంటే వద్దనేవాడు. తను కావాలనుకున్నప్పుడు చేసేవాడు.

అందుకే ఇప్పుడు రాజారావు సినిమాకు రమ్మని అడిగితే రానన్నాడు.

ఎనిమిదిన్నరయ్యింది.

సుందరం లేచి నిల్చుని రాజారావు దగ్గరకు వెళ్ళి సిగరెట్టు అడిగి తీసుకున్నాడు. కొబ్బరితాడుకున్న నిప్పుతో దాన్ని ముట్టించుకుని మళ్ళీ వచ్చి బెంచీమీద కూర్చున్నాడు.

రోడ్డుమీద జనం క్రమంగా తగ్గిపోతున్నారు.

సుందరానికి ఆకలివేసింది.

త్వరగా ఇంటికి వెళ్లి అన్నం తినాలనుకున్నాడు. కానీ ఇంటికి వెళితే తండ్రి తన నిర్ణయం గురించి అడుగుతాడు. తను చెప్పాలి.

మూత్రపిండాలు చెడిపోయి పదినెలలుగా పక్షవాతంతో మంచాన పడివున్న తండ్రిని తల్చుకుంటే సుందరానికి బాధ కలిగింది.

జీవితం గురించి తను ఎన్ని రంగుల కలలు కన్నాడు? వాటన్నింటినీ సమూలంగా నరికివేస్తూ ఇలాంటి సంఘటన జరుగుతుందని ఏనాడూ అనుకోలేదు.

కానీ జరిగింది - ఏమిటి చెయ్యటం?

డిగ్రీ పూర్తయిన ఆర్నెల్లకు సుందరం హైదరాబాద్ వెళ్ళాడు. అక్కడ అతను ఓ డిటర్జెంటు సోప్స్ కంపెనీలో సేల్స్ ప్రమోటర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆ ఉద్యోగం చేస్తూ మరో నుంచి ఉద్యోగం సంపాదించుకోవాలని అతని ఆలోచన.

సేల్స్ ప్రమోటర్‌గా అతని సంపాదన పూర్తిగా అతడి ఖర్చులకే సరిపోయేది కాదు. అప్పుడప్పుడు డబ్బులుంటే పంపమని తండ్రి దగ్గర్నించి అతనికి ఉత్తరాలు వస్తూవుండేవి. అతని తండ్రి ఓ బట్టలషాపులో గుమస్తాగా చేసేవాడు. మరీ బావుండదని ఎవరిదగ్గరైనా అప్పుచేసి సుందరం తండ్రికి ఎంతోకొంత పంపిస్తూవుండేవాడు.

శ్రీదేవి కూడా అతనితో పాటు ఆ కంపెనీలో ఉద్యోగం చేసేది. సుందరానికీ, ఆమెకీ బాగానే స్నేహం కుదిరింది. అతడి కుటుంబ పరిస్థితుల గురించి శ్రీదేవికి సుందరమే అప్పుడప్పుడు చెబుతూవుండేవాడు.

అయితే శ్రీదేవి అతడున్నంత పేదరికంలో లేదు. అందుకే ఎప్పుడైనా

అతనికి ఆర్థికంగా సహాయం చేస్తానని అంటూ వుండేది. కానీ అతను తీసుకునేవాడు కాదు. ఒక్కోసారి తనే అడిగేవాడు. అతని ప్రవర్తన ఆమెకు వింతగా వుండేది. అతని ప్రవర్తన కారణంగా ఏమో శ్రీదేవికి అతనిమీద ఇష్టం పెరిగిపోయింది.

ఒకరోజు తనని పెళ్ళి చేసుకొమ్మని సుందరాన్ని అడిగింది శ్రీదేవి. ఆ మాట విని సుందరం నవ్వి ఇలా అన్నాడు.

“శ్రీదేవీ.... నువ్విలా అడిగినందువల్ల నిన్ను పెళ్ళి చేసుకోవాలనిపించటంలేదు. నువ్వు అడగకుండా వున్నట్లయితే ఏదో ఒకరోజు నేనే నిన్ను పెళ్ళి చేసుకోమని తప్పకుండా అడిగేవాడిని”

అతని మాటలతో శ్రీదేవికి మతిపోయింది.

ఇలా జరిగిన తర్వాత ఒకరోజు ఉదయం ఐదు గంటలకే తలుపు తట్టిన చప్పుడుకి లేచి తలుపు తీసిన సుందరానికి ఎదురుగా అతని స్నేహితుడు ప్రదీప్ కనిపించాడు.

కొంచెంసేపటికి అతను సుందరానికి చెప్పిన వార్త ఇది - సుందరం తండ్రి పెరాలసిస్‌తో హాస్పిటల్‌లో చేరాడని.

ఆరోజునే సుందరం హైదరాబాద్ వదిలి వచ్చేశాడు. మంచంలో వున్న తండ్రిని చూసి చలించిపోయాడు. డాక్టరు చెప్పిన మాటలు విని తండ్రి ఇక కోలుకోడని, చావుకు దగ్గరలో వున్నాడనీ తెలిసినప్పుడు అతను భూమిలోకి కుంగిపోయేడు. ఎవ్వరూ చెప్పకుండానే కుటుంబభారం సుందరాన్ని కొండచిలువలా చుట్టుకుపోయింది.

మానవతా దృక్పథంతో షాపు యజమాని ఉద్యోగాన్ని సుందరానికి ఇచ్చాడు. కానీ ఆ ఉద్యోగానికి కొత్త కాబట్టి జీతాన్ని తగ్గించాడు.

తగ్గిన జీతం. ఆ జీతానికి అందని కుటుంబ ఖర్చులు. పెళ్ళీడుకు వచ్చిన చెల్లెలు. పెళ్ళీడుకు పరుగులుదీస్తున్న మరో చెల్లెలు. చివరి తమ్ముడు చదువు. ఇవన్నీ సుందరం జీవితాన్ని పాతాళానికి అణగదొక్కిన క్రూరమైన పాషాణాలు.

తండ్రి ఎక్కువకాలం బతకడని తెలిసినా స్నేహితుల దగ్గర శక్తికొద్దీ అప్పు చేసి సుందరం తండ్రికి వైద్యం చేయించాడు. అయినా ....... లేదు. తను మృత్యువుకు దగ్గరగా వెళ్ళుతున్నప్పుడు సుందరం తండ్రికి తన కూతురి పెళ్ళి చేసి పోవాలని అనిపించింది. కానీ, కట్నం అందుకు అడ్డుగోడగా నిలిచింది.

ఇలాంటి పరిస్థితుల్లోనే వాళ్ళకు తెలిసినవాడు ఓ సంబంధం తీసుకువచ్చాడు.

కట్నం లేకుండా సుందరం చెల్లెలు కస్తూరిని తన కొడుక్కి చేసుకోటానికి ఒకాయన సిద్ధంగా వున్నాడు. కానీ ఆయన కూతుర్ని సుందరం చేసుకోవాలి. ఇందుకు సుందరం తల్లిదండ్రులు ఒప్పుకున్నారు.

ఇద్దరి పిల్లల పెళ్ళిళ్ళు చూసి కొంత నిశ్చింతగా కన్ను మూస్తానన్నాడు తండ్రి. కానీ సుందరం పెళ్ళికి తన అంగీకారం తెలియజేయలేదు. విషయంలో అతను ఓ నిర్ణయానికి రాలేకపోయాడు.

చెల్లెలి పెళ్ళి అవటం తనకు సంతోషమే. కాని సరైన సంపాదన లేకుండా తన కుటుంబసభ్యులు నాతోపాటు భార్యనీ ఆ తర్వాత పుట్టుకొచ్చే సంతానాన్ని తను పోషించగలడా?

ఏమైనా రాత్రికి తన నిర్ణయాన్ని తెలియజేయమని తండ్రి గట్టిగా చెప్పాడు.

ఇప్పుడు తను ఇంటికి వెళ్ళటంతోనే తన నిర్ణయాన్ని తండ్రికి చెప్పాలి. అలా ఆలోచిస్తున్నప్పుడు సుందరానికి అసలు తనే లేకుండాపోతే ఎలా వుంటుందనే ఆలోచన వచ్చింది.

"సుందరం" పిల్చాడు రాజారావు.

ఆలోచనల నుంచి బయటపడ్డాడు సుందరం.

"కొట్టు మూస్తున్నాను. సినిమాకు వెళ్ళాలి" అన్నాడు రాజారావు.

రాజారావుతో తనూ సినిమాకి వెళితే బవుండేదేమో అనిపించింది సుందరానికి. కానీ మళ్ళీ వెళ్ళకూడదనుకున్నాడు.

"టైమెంతయ్యింది?" అనడిగాడు.

"తొమ్మిది" చెప్పాడు రాజారావు.

సుందరం మాట్లాడకుండా రోడ్డెక్కాడు.

సరిగ్గా అప్పుడు లూనామీద వెళుతున్న అతని స్నేహితుడు సుందరాన్ని చూసి ఆగిపోయి – "మా అన్నయ్య స్నేహితుడు సూరిబాబు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడుట. వెళుతున్నాను. నువ్వుకూడా వస్తావా?" అనడిగాడు సుందరాన్ని.

ఆశ్చర్యం నుంచి తేరుకుని – "నేను రానులే. నువ్వెళ్ళు. ఇంతకీ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు?" అనడిగాడు.

"ఏముంది కేసే – కుటుంబంకోసం అప్పులు చేశాడు. తీర్చలేకపోయాడు.

అప్పులవాళ్ళ ఒత్తిడి తట్టుకోలేకపోయాడు" అంటూ వెళ్ళిపోయాడు.

సుందరం మనసు వికలమయ్యింది.

అతను చిన్నగా నడిచి తను రోడ్డు దగ్గరకు వచ్చాడు. ఆ రోడ్డు మొదట్లో వున్న వేణుగోపాలస్వామి గుళ్ళో దీపాలు వెలుగుతున్నాయి. రెండు రోజులుగా ఏవో ఉత్సవాలు జరుగుతున్నాయి.

గుళ్ళోకి వెళ్ళాడు సుందరం.

ఎవరో ఒక వేదాంతి ఉపన్యాసం చెబుతున్నాడు. చాలామంది శ్రద్ధగా వింటున్నారు. సుందరం ఒక మూల నిల్చున్నాడు. చావుపుట్టుకల మర్మాన్ని గురించి చెబుతున్నాడాయన.

కొంచెంసేపటికి సుందరం ఇంటికి వచ్చాడు.

స్నానం చేసి భోజనం చేసిన తర్వాత మంచంపై పడుకోబోతుండగా తండ్రి అతని నిర్ణయం గురించి అడిగాడు. ఏ సంగతీ తెల్లారిన తర్వాత చెబుతానన్నాడు సుందరం.

అతను పడుకున్నాక అతని కుటుంబసభ్యులు, వాళ్లతో తనకు ముడిపడి వున్న సమస్యలూ అతడి చుట్టూ తిరగటం మొదలుపెట్టాయి. నరికివేయబడిన తన బంగారుకలల జీవితం అతడిని చూసి హేళనగా నవ్వుతున్నట్టు అనిపించింది.

ఆ క్షణాల్లోనే సుందరానికి అప్పులబాధ తట్టుకోలేక నిద్రమాత్రలు మింగి చనిపోయిన సూరిబాబు - అన్ని సమస్యలకీ చావే పరిష్కారమని గుళ్ళో ఉపన్యాసం చెబుతున్న వేదాంతి గుర్తుకువచ్చారు.

❖ ❖ ❖

అలా ఉత్తరదిక్కుకు వెళ్ళిన యువరాజు అక్కడ తనకు ఎదురైన ఎన్నోరకాల ఆపదలను ధైర్యసాహసాలతో ఎదుర్కొని తన దేశాటనను కొనసాగించాడు. ❖

*స్వాతి మాసపత్రిక, జూలై 1998*